క్లుప్తంగా

వరలక్ష్మికి నంది అవార్డు



అవార్డుతో సత్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమంలో పోరాడిన రాచపల్లి వరలక్ష్మికి రాష్ట్రస్థాయి నంది అవార్డు పురస్కారం లభించింది. హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నంది అవార్డులు అందజేశారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన వరలక్ష్మికి తన ఉద్యమ నేపథ్యం గ్రహించి విమలక్క, ఏపూరి సోమన్న, నేర్నాల కిశోర్, దరువు అంజన్న చేతుల మీదుగా నంది అవార్డుతో సత్కరించారు.

మల్లికార్జునస్వామి ఆలయ ఈవోగా మోహన్‌రెడ్డి



దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్‌గా మోహన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విశ్వనాథశర్మ ఇన్‌చార్జి ఈవోగా ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణ

మద్దూరు(హుస్నాబాద్): ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదవాలని ఎస్‌ఐ నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంగ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ అమలు చేస్తున్న పథకాలను తీసుకెళ్లి బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిట్ల పరశురాములు, మండల ఇన్‌చార్జి తిరుపతిరావ్‌లు పిలుపునిచ్చారు. బుధవారం చిన్నకోడూరు ఎల్లమ్మ ఆలయంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీల సంస్థాగత నిర్మాణం పటిష్టంగా జరగటానికి కృషి చేయాలన్నారు. నిరంతరం ప్రజలతో కలిసి వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. ఈ నెల 15 నుంచి 20 తేదీల్లో జరగనున్న శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లే టార్గెట్‌గా పెట్టుకొని కార్యక్రమాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి భూమేశ్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెక్కల్ గుట్టపై అభివృద్ధి పనులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆలయ చైర్మన్ లింగారెడ్డి అన్నారు. బుధవారం గుట్టపై చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్‌తో పాటు పలువురు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెక్కల్ గుట్టపైకి మిషన్ భగీరథ నీటిని పంపేందుకు పైపులైన్ నిర్మాణం కోసం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సీడీఎఫ్ నిధుల నుంచి రూ.3లక్షలను మంజూరు చేశారన్నారు. అదేవిధంగా ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి మండల పరిషత్ నిధుల నుంచి గుట్టపై సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యే, తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బెక్కల్ ఆలయ మాజీ చైర్మన్ నలగొప్పుల రాములు, బీఆర్ఎస్ నాయకులు ఆరె జగన్, డైరెక్టర్లు గొట్టిపర్తి వెంకన్న, గుండె ప్రభాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఎల్ఈడీ టీవీ వితరణ



టీవీ అందజేస్తున్న డైరెక్టర్ వివేకానంద

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం జెడ్పీ హైస్కూల్‌కు 'సిరీ సీడ్స్' కంపెనీ ఎల్ఈడీ టీవీ వితరణ చేసింది. బుధవారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ సమక్షంలో కంపెనీ డైరెక్టర్ వివేకానంద టీవీని పాఠశాల హెచ్‌ఎం శంకర్‌రెడ్డికి అందజేశారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం

- ప్రకృతి వనంలో పచ్చదనం కరువు
- నీరు పోసేవారు లేక ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



గొల్లకుంట ప్రకృతి వనంలో ఎండుతున్న మొక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీ పాలకవర్గం, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో గ్రామీణులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం ఫలించడం లేదు. ఇది అక్కన్నపేట మండలంలోని పల్లె ప్రకృతి వనాల దుస్థితి. ప్రభుత్వం గ్రామాలకు కొత్త శోభ తీసుకురావడానికి పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని పంచాయతీలకు సూచించింది. దీంతో గ్రామ పంచాయతీలకు అనుకూలంగా ఉన్న కొద్దిమేర స్థలంలో రూ.లక్షల నిధులు కేటాయించి ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో నాటిన మొక్కలన్నీ ఎండుముఖం పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక గొల్లకుంట గ్రామ పల్లె ప్రకృతి వనంలోనే అనుకుంటే పొరపాటే. మండలంలోని చాలా గ్రామాల్లోని ప్రకృతి వనాల్లో ఇదే పరిస్థితి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ దుస్థితి నెలకొందని పలువురు బాహాటంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటే తప్పా అధికారుల్లో మార్పురాదని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను తయారుచేయాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



జంగపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను తయారు చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నూతన మండల వనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పరిధిలోని జంగపల్లి, వీరారెడ్డిపల్లి, మాధన్నపేట, ఖాజీపూర్, భూంపల్లి ఉన్నత పాఠశాలలతో పాటు మిరుదొడ్డి మండల పరిధిలోని లింగుపల్లి ప్రాథమిక పాఠశాల, మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను, పదవ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమగారి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్, రవి, సౌజన్య, కొండం శ్రీకాంత్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్షీపూర్ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలు



సిద్దిపేటరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజలే బీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం చెబుతారని పలువురు నాయకులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో టీపీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హాథ్ సే హాథ్ జోడోయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కరపత్రాలను అందించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు సూర్యవర్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రాములు, దరిపల్లి చంద్రం, మహేందర్, లక్ష్మి, కలీమొద్దీన్, కనకయ్య, రాములు, అత్తు, రమేశ్, శివకుమార్, శంకర్ పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తొగుటలో నిరసన దీక్ష నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలో చందాపూర్, రాంపూర్, లింగంపేట గ్రామాల్లో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్మెన్ కార్యదర్శి తిరుపతి, నాయకులు నరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

వర్గల్(గజ్వేల్): వరిపైరును నష్టపరుస్తున్న మొగిపురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వర్గల్ ఏఓ శేషశయన అన్నారు. బుధవారం ఆమె తున్కిఖాల్సాలో పొలాలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ముదురునారును నాటడం, రాత్రివేళ ఉష్ణోగ్రత తగ్గి చలి వాతావరణంతో వరిపైరును మొగిపురుగు ఆశించి నష్టపరుస్తుందని తెలిపారు. మొగిపురుగు నివారణకు 40 రోజుల పైరుకు ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్-3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాంట్రానిప్రొల్-0.4జి గుళికలను 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో చల్లాలని సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంట సాగుచేసే రైతులను రాయితీలతో ప్రోత్సహిస్తుందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఈఓ ధర్మేందర్, రైతులు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): లింగాకర్షక బుట్టలతో వరిలో చీడ పురుగుల ఉధృతిలను తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణి అన్నారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో రైతు బైటీ శ్రీనివాస్ వరి పంటను పరిశీలించారు. పంటలకు సోకిన తెగుళ్ల నివారణ కోసం పొలంలో లింగాకర్షక బుట్టలను అమర్చారు. పొలంలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టల్లో లూర్ అనే రసాయనం వాసనతో కాండం తొలుచు పురుగులు బుట్టల్లో పడగానే బయట పడేసుకోవాలన్నారు. దీంతో పాటు మందులను పిచికారీ చేసుకోవడంతో తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విష్ణు, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు, కారోబార్ రాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. గురువారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జీపీపీ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు తమ సమస్యలను, అభిప్రాయాలను డయల్ యువర్ డీఎం ద్వారా తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని 9959226270 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలపాలని సూచించారు.

కనుల పండువగా సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

దుబ్బాకటౌన్: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో వేద పండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన కనుల పండువగా జరిగింది. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ముదిరాజు కులపెద్దలు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దుర్గామాత ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో బొడ్రాయి, దుర్గామాత ఆలయ నిర్మాణానికి బుధవారం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మర్రిచెట్టు వెనుక భాగం, పోలీస్ స్టేషన్ సమీపంలో స్థలాలను పరిశీలించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితం అన్నీ కులసంఘాల నుంచి కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గ్రామంలో చావిడిగా పిలువబడే చోట బొడ్రాయి ఏర్పాటుకు దాదాపుగా అందరూ ఒకే అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ పెసరు సాంబరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వైద్య ఖర్చులకు సాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన జంధ్యాల జహంగీర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరగగా బుధవారం సిద్దిపేటలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు మంద సుమన్, దాకూరి తిరుపతిరెడ్డి, కూస కర్ణాకర్, బైరగోని వెంటటేశ్, ఉత్కూరి అనిల్ పాల్గొన్నారు.

◆ శివరాత్రికి ప్రత్యేక బస్సులు

సిద్దిపేటకమాన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట నుంచి వేములవాడ, ఏడుపాయలకు ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రతీ 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు అందుబాటులో ఉంటుందని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ హుస్నాబాద్ నుంచి పొట్లపల్లికి..

హుస్నాబాద్: హుస్నాబాద్ ఆర్టీసీ డిపో నుంచి పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయం వరకు ప్రతీ పది నిమిషాలకు ఒక బస్సు నడిపించనున్నట్లు డిపో మేనేజర్ అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. పొట్లపల్లి తెలిపారు. బస్టాండ్ నుంచి వయా మల్లె చెట్టు చౌరస్తా, గాంధీ చౌరస్తా మీదుగా బస్సులను నడిపిస్తారని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

◆ పరీక్షల వేళ దుమ్మాలు కొట్టొద్దు

వర్గల్(గజ్వేల్): పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు దుమ్మాలు కొట్టొద్దని వర్గల్ జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్ సూచించారు. రెండు రోజులుగా మండలంలోని తున్కిఖాల్సా, మీనాజీపేట తదితర గ్రామాల పది విద్యార్థుల హాజరు తీరుపై దృష్టి సారించారు. తునిఖాల్సాలో రెండు నెలలుగా గైర్హాజరవుతున్న ఓ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని తెలిపారు. వారి వెంట హైస్కూల్ హెచ్‌ఎం ఉన్నారు.

◆ ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొండపాక(గజ్వేల్): ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మత్స్య సహకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి భాను ప్రకాశ్ అన్నారు. మండల పరిధిలోని మంగోల్ గ్రామంలో ముదిరాజ్‌లకు మత్స్య సహకార సంఘాల్లో కల్పించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సభ్యత్వాలను అందజేశారు. రాజకీయాల్లో ముదిరాజ్‌లకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ పేద యువతి వివాహానికి చేయూత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటకు చెందిన లకరబోయిన యాదగిరి భారతీ దంపతుల కూతురు మౌనిక వివాహానికి తమవంతు సాయంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ రూ.25వేలు అందించింది. పేదింటి యువతి వివాహానికి తాము అండగా ఉండాలనే సంకల్పంతోనే సాయం అందించామని యూత్ నాయకులు బున్న ప్రవీణ్, కూరపాటి సంతోష్, దారం మధు తెలిపారు.

◆ పెండింగ్ నిధులు విడుదల చేయాలి

సిద్దిపేటజోన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్మిక శాఖ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనుబంధ సంస్థ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ మాట్లాడుతూ.. 2018 నుంచి 2023 పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సంక్షేమ నిధులను విడుదల చేయాలని కోరారు. జిల్లాలో నోడల్ అధికారులతో కార్మికులు పూర్తిగా నష్టపోతున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు.

◆ విద్యుత్ ఆంక్షలపై రైతుల ధర్నా

బెజ్జంకి(సిద్దిపేట): వ్యవసాయ సాగుకు అధికారులు విద్యుత్ సరఫరాలో ఆంక్షలు విధించడంపై మండలంలోని తోటపల్లి గ్రామ సబ్‌స్టేషన్ వద్ద వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒకవైపు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చేబుతున్నా అధికారులు ఆంక్షలతో విద్యుత్ సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నారని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనపై ఏఈ బాలకిషన్‌ను వివరణ కోరగా సాంకేతిక కారణాలతో విద్యుత్ సమస్య తలెత్తిందని రైతులు సహకరించాలని కోరారు.

పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: రైతులు పశు పోషణలో జాగ్రత్తలు తీసుకుంటే పాల దిగుబడులు పెరుగుతాయని పశువైద్య ఏడీ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మహ్మదాపూర్ గ్రామంలో జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఏడీ వెంకట్‌రెడ్డి రైతులకు పోషణలో తగు జాగ్రత్తలపై వివరించారు. పశువులను ఎప్పుడు గమనిస్తూ వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. 55 దీర్ఘకాలిక గర్భకోశవ్యాధుల పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో మండల పశువైద్యులు డాక్టర్ విజయ్‌భార్గవ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): జీవాలకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ సారయ్య, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేముల కొండల్‌రెడ్డి అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం బద్దిపడగలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్త, శాస్త్రీయమైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎనిమిది ఆవులు, గేదెలకు చూడి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే 31 దూడలను పరీక్షించి నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి, రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ జ్యోత్స్న, నర్సింహారెడ్డి, తిరుపతి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జగత్‌కుమార్‌రెడ్డి, సత్యప్రకాశ్‌రెడ్డి, వైద్యాధికారులు వేణుగోపాల్, చతుర్వేది, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజేందర్, నరేశ్, శ్రీకాంత్, సుధాలక్ష్మి పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి



పన్నులు వసూల్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటజోన్: మున్సిపల్‌కు సంబంధించిన ఇంటి, నల్లా పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి బల్దియా అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లతో ఆస్తి పన్ను బిల్లుల వసూళ్ల ప్రక్రియలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బకాయిదారుల ఇంటికి, వ్యాపార, వాణిజ్య సంస్థల వద్దకు వెళ్లి బకాయిలు వసూల్ చేశారు. సకాలంలో చెల్లించడంతో అటు గృహ యజమానులు, ఇటు బల్దియా సిబ్బందికి సులభంగా ఉంటుందని తెలిపారు. కాకతీయనగర్‌లో రూ.66,904, రూ.74,772లను సంబంధించిన గృహ యజమానులకు అవగాహన కల్పించి వసూల్ చేశారు. ఆయన వెంట మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలతో సమాజంలో గుర్తింపు



బహుమతి అందజేస్తున్న ఎంపీపీ దుర్గయ్య

కొండపాక(గజ్వేల్): సమాజంలో క్రీడా నైపుణ్యతలు గుర్తింపును పొందేలా చేస్తాయని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ అన్నారు. ఈనెల 17న సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ఎంపీపీ ప్రాతినిథ్య గ్రామాలైన బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. టోర్నమెంట్‌లో వివిధ గ్రామాలకు చెందిన 9 టీమ్‌లు పాల్గొనగా ప్రథమ స్థానాన్ని బందారం సన్‌రైజర్స్ టీమ్, అంకిరెడ్డిపల్లి చిల్లీ గ్యాంగ్ టీమ్ ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. ప్రథమ బహుమతిగా కప్‌తో పాటు రూ.10వేలు నగదు, ద్వితీయ బహుమతిగా కప్‌తో పాటు రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు



సిద్దిపేటజోన్: శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



చేర్యాల: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు ద్వారా ప్రతీ ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. బుధవారం కోమటిచెరువు ఓపెన్ ఆడిటోరియంలో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు ఆటో కార్మికులకు ప్రత్యేక కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని సందర్శించి, వసతులు, ఏర్పాట్లపై ఆరా తీశారు. మొదటి రోజు 162 ఆటో కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, ఆటో డ్రైవర్స్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాయిరాం, కౌన్సిలర్ సాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ బందారం శ్రీలతరాజు అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించారు.

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, మున్సిపల్ చైర్మన్ శ్రీధర్‌రెడి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆడపు నరేందర్, మంగోల్ చంటి, కనకవ్వయాదగిరి, ముస్త్యాల తారయాదగిరి, సందుల సురేశ్, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంజయ్య, ఉమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యం

గజ్వేల్: సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

హుస్నాబాద్‌రూరల్: కంటి వెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. బుధవారం ఎంపీపీ లకావత్ మానసతో కలిసి జిల్లెలగడ్డలో కంటి వెలుగును ప్రారంభించారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

రాస్తారోకో నిర్వహించిన రైతులు



రోడ్డుపై అడ్డుగా ట్రాక్టర్ పెట్టడంతో నిలిపోయిన వాహనాలు

నంగునూరు(సిద్దిపేట): కరెంట్ కోతలతో పంటలు ఎండుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం ఖానాపూర్ రైతులు ముండ్రాయి వద్ద రోడ్డుపై ట్రాక్టర్ అడ్డుపెట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు చింతల శ్రీనివాస్, పరశురాములు మాట్లాడుతూ.. తాను ఎనిమిది ఎకరాల్లో మల్బరీ, నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశానని విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కేవలం రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తున్నారని, కరెంట్ కోతల విషయమై విద్యుత్ ఏఈ, డీఈలకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నామని మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో ప్రకటించారని, కనీసం 12 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. వచ్చిపోయే కరెంట్‌తో ఇబ్బందులు పడుతున్నామని ఎవరికి చెప్పినా పట్టించుకోకపోవడంతో రాస్తారోకో చేశామన్నారు. ప్రధాన రహదారిపై ట్రాక్టర్ అడ్డుపెట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట పోలీసులు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): పీహెచ్‌సీ కేంద్రానికి వచ్చే ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్య సేవలను అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మిరుదొడ్డి పీహెచ్‌సీ అభివృద్ధికి మంజూరైన రూ.87,500 నిధుల ప్రణాళికపై బుధవారం ఎంపీపీ గజ్జెల సాయిలుతో కలిసి వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసవాలు అధికంగాజరిగేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిరుదొడ్డి, భూంపల్లి పీహెచ్‌సీ డాక్టర్లు సమీనా సుల్తానా, సాయి తేజశ్విని, సీహెచ్‌ఓ లింగమూర్తి, వైద్య సిబ్బంది అంబేడ్కర్ పాల్గొన్నారు.